రైతులపై ఇంత కక్షనా?

- ఇప్పుడు గేటు, స్టాటర్లు లాక్కెళ్లింద్రు.. రేపు పుస్తెలతాళ్లు గుంజుకపోతరా?
- పంటలు ఎండుతున్నా సోయిలేదా?
- రైతులను ఇన్ని రకాలుగా వేధిస్తరా?
- ఆత్మగౌరవంతో బతికే అన్నదాతలపై ఈ దాష్టీకాలేమిటి? దుర్మార్గాలేమిటి?
- సర్కారు తీరుపై కేటీఆర్ మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): 'నిన్న గేటు ఎత్తుకెళ్లింద్రు.. నేడు స్టార్టర్లు పీక్కెళ్లింద్రు.. రేపు పుస్తెల తాళ్లు గుంజుకపోతరా?' అని సర్కారు తీరుపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. వ్యవసాయరంగంలో కేసీఆర్ హయాంలో నెలకొన్న సంతోషపు ఆనవాళ్లను చెరిపేసి, ఉమ్మడి రాష్ట్రంలో రైతులను పీడించిన సంక్షోభం ఆనవాళ్లను తెలంగాణ నేలపై మళ్లీ తెస్తామంటే రైతులు సహించబోరని హెచ్చరించారు. కష్టాల్లో ఉండి, అప్పుల పాలైన అన్నదాతలపై కాంగ్రెస్ సర్కార్‌కు ఇంత కక్షనా? అని మండిపడ్డారు. సాగునీరు లేక పంటలు ఎండిపోతుంటే పట్టించుకునే సోయిలేదు కాగాని, రైతులను ఇన్ని రకాలుగా వేధిస్తరా? అని ప్రశ్నించారు. 'రైతులంటే అంత అలుసైపోయారా? బీఆర్‌ఎస్ ప్రభుత్వం రద్దుచేసిన నీటి తీరువాను ఐదేండ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు వసూలు చేస్తరా? రైతులకు సాగునీరిచ్చే సోయిలేదు గాని, ఓట్లనాడు ప్రేమ ఒలకబోసి అధికారం చేపట్టాక వారికి నరకం చూపిస్తరా? రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ సరిగా చేయ చేతగాక ఇంత దారుణానికి ఒడిగడుతరా?' అని నిలదీశారు. రైతు భరోసాకు సవాలక్ష ఆంక్షలు పెట్టి రైతన్నలను సంక్షోభంలోకి నెట్టింది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కారేనని విమర్శించారు. రైతు పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టి మళ్లీ వాళ్లు అప్పులపాలయ్యేలా చేసిన పాపం కాంగ్రెస్ సర్కారుదేనని మండిపడ్డారు. 'ఆత్మగౌరవంతో బతికే అన్నదాతపై ఈ దాష్టీకాలేమిటి? దుర్మార్గాలేమిటి?' అని ధ్వజమెత్తారు. వ్యవసాయరంగంలో సంతోషాన్ని చెరిపేసి మళ్లీ సంక్షోభాన్ని తెస్తామంటే రైతులు సహించరని, సంఘటితంగా పోరాడి సీఎం రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధిచెప్తారని హెచ్చరించారు.

కేసీఆర్ పాలనలోనే సేవాలాల్ కలల సాకారం

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్‌కు కేసీఆర్ పాలనలోనే సముచిత గౌరవం లభించిందని కేటీఆర్ గుర్తుచేశారు. తండాలను పంచాయతీలుగా మార్చి ఆయన కలలను సాకారం చేశారని పేర్కొన్నారు. ఆ మహనీయుడి పేరిట హైదరాబాద్‌లో బంజారా భవనాన్ని నిర్మించారని తెలిపారు. శనివారం సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఎక్స్ వేదికగా ఆ మహనీయుడికి కేటీఆర్ నివాళులర్పించారు. జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించి గౌరవించుకున్నామని గుర్తుచేశారు. వీరుడిగా, సంఘ సంస్కర్తగా, వైతాళికుడిగా సేవాలాల్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కీర్తించారు. ఆయన చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ ప్రజాసేవకు అంకితంకావాలని పిలుపునిచ్చారు.

బిల్లు చెల్లిస్తారా? బడికి తాళం వేయాలా?

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం బుద్ధారంలోని ప్రాథమిక పాఠశాలలో గత సంవత్సరం ఎన్నికల కంటే ముందు పనులు పూర్తి చేసినా, ఇప్పటివరకు బిల్లు చెల్లించకపోవడంతో తాళం వేయడానికి శనివారం పాఠశాలకు వెళ్లాడు. హెచ్‌ఎం గాయత్రి సమాచారం మేరకు ఎంఈవో సదరు కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సాయంత్రం వరకు బిల్లు అప్‌లోడ్ అయ్యేలా చూస్తానని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్ వెనుదిరిగాడు.

- పెద్దేముల్

పంటలు కొనండి మహాప్రభో..?

- రాష్ట్రవ్యాప్తంగా రైతుల గగ్గోలు.. పంటలకు దక్కని మద్దతు ధర
- అత్యంత దయనీయంగా వేరుశనగ, మిర్చి రైతుల పరిస్థితి
- అయినా పట్టించుకోని ప్రభుత్వం
- మద్దతు ధరతో కొనుగోలుకు చర్యలు శూన్యం
- కొనుగోళ్లపై ఆయిల్‌ఫెడ్, మార్క్‌ఫెడ్ దోబూచులాట
- నిలిచిపోయిన పత్తి కొనుగోళ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర దక్కకపోవడం, ప్రభుత్వం పంటలు కొనకపోవడం వారిని ఇబ్బందుల్లోకి నెట్టేసింది. మరీ ముఖ్యంగా మిర్చి, వేరుశనగ పండించిన రైతుల్లో ఆందోళన నెలకొంది. కనీసం పెట్టుబడులు కూడా వెళ్లక అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలు కొనండి మహాప్రభో.. అంటూ రైతాంగం ప్రభుత్వాన్ని వేడుకుంటున్నది. అయినా ప్రభుత్వం చోద్యం చూస్తున్నది. మద్దతు ధరతో పంటలు కొనేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది.

పత్తి కొనుగోళ్లు బంద్

ఈ సీజన్‌లో పత్తి రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. మద్దతు ధర రూ. 7521 ఉండగా మార్కెట్లో రూ. 6వేలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో రైతులకు కొంత ఊరట కలిగించేలా సీసీఐ రాష్ట్రంలో మద్దతు ధరకు పత్తి కొనుగోళ్లు చేపట్టింది. అయితే ప్రైవేటు వ్యాపారుల మాదిరిగానే సీసీఐ కూడా కోతలు, కొర్రీలతో రైతులను ఇబ్బంది పెట్టింది. ఇక ఇప్పుడు సాఫ్ట్‌వేర్ సమస్యతో రాష్ట్రవ్యాప్తంగా పత్తి కొనుగోళ్లను నిలిపివేసింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు మార్కెట్లలో పత్తి పేరుకుపోయింది. ఈ విధంగా ఈ సీజన్‌లో మిర్చి, వేరుశనగ, పత్తి, కంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రభుత్వ మాటలు.. ప్రకటనలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పడిపోయిన పల్లి, పత్తి ధరలు.. వ్యాపారుల దోపిడీ

మార్కెట్లో వేరుశనగ మద్దతు ధర క్వింటాలుకు రూ. 6783 ఉండగా బహిరంగ మార్కెట్లో ప్రైవేటు వ్యాపారులు రూ. 6వేల లోపే కొనుగోలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అయితే కనీసం రూ. 5వేలు కూడా ధర ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు మిర్చి పంటకు కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించలేదు. అయితే క్వింటాలుకు కనీసం రూ. 15-17వేలు ధర దక్కితే గానీ రైతులకు గిట్టుబాటు కాదు. కానీ మార్కెట్లో కేవలం రూ. 10-11వేలు మాత్రమే ధర పలుకుతున్నది. కొన్ని సందర్భాల్లో ఇది రూ. 9వేలకు కూడా పడిపోతున్నది. ఉమ్మడి ఖమ్మంలో మార్కెట్లకు మిర్చి పోటెత్తగా, మహబూబ్‌నగర్‌లో వేరుశనగ పోటెత్తింది. ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా తయారై ధర తగ్గించేశారనే విమర్శలున్నాయి. ధరలను తగ్గించేసి రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రైవేటు వ్యాపారులను నిలవరించాలి. కానీ పలు మార్కెట్లలో అధికారులే దగ్గరుండి మరీ ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చేతులెత్తేసిన సర్కారు...

మార్కెట్లో పంటల ధరలు పడిపోయిన సందర్భంలో ప్రభుత్వం రంగంలోకి దిగి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. కానీ కాంగ్రెస్ సర్కారు రైతులను గాలికొదిలేసింది. మద్దతు ధరకు పంటల కొనుగోలుకు కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు. కొనుగోళ్ల నెపాన్ని కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నది. ఇందులో భాగంగానే వేరుశనగ కొనుగోలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి చేతులు దులుపుకున్నది.

మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ దోబూచులాట

వేరుశనగ కొనుగోళ్లపై మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్ దోబూచులాట ఆడుతున్నాయి. మీరు కొనుగోలు చేయాలంటే.. మీరేనంటూ ఇరు సంస్థల అధికారులు తప్పించుకోవడం గమనార్హం. చివరకు కొనుగోలు బాధ్యతను ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌కు అప్పగించింది. ఇందులో భాగంగానే కేంద్రానికి లేఖ రాసింది. ఇప్పటి వరకు కేంద్రం అనుమతి వచ్చింది లేదు.. గింజ పల్లీ కొన్నది లేదు. వాస్తవానికి ఆయిల్‌ఫెడ్‌కు వేరుశనగలు అవసరం. ఈ సంస్థ కోల్డ్‌ప్రెస్ ఆయిల్‌ను తయారు చేసి విక్రయిస్తున్నది. ఇందులో భాగంగానే ప్రైవేటు సంస్థల నుంచి వేరుశనగను కొనుగోలు చేస్తున్నది. ఇందుకు బదులుగా ప్రస్తుతం మార్కెట్లో ధర తక్కువున్న నేపథ్యంలో రైతుల నుంచి కొనుగోలు చేస్తే ఇటు రైతులకు మేలు జరుగుతుంది, కానీ అలాంటి చర్యలేవి ఆయిల్‌ఫెడ్ తీసుకోలేదు. కనీసం మార్క్‌ఫెడ్ సహకారం కూడా తీసుకోవడం లేదు.

మరో రైతు ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

భూమిని ఇద్దరు కుమారులకు నాలుగు ఎకరాల చొప్పున ఇచ్చాడు. మిగిలిన రెండు ఎకరాలతోపాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి, పత్తి వేశాడు. గత సంవత్సరం పంటల దిగుబడి సరిగా రాకపోవడం, ఈసారి కూడా ఆశించిన స్థాయిలో పంటలు పండలేదు. పంటల సాగు కోసం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు పెరగడంతో కొద్దిరోజులుగా దిగాలు ఉంటున్న కొమురయ్య శనివారం మిర్చి తోటలోకి వెళ్లి పురుగుమందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే పరకాలలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అశోక్ తెలిపారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు ఎట్టకేలకు నియామక పత్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ) : సుదీర్ఘ నిరీక్షణ.. ఎడతెగని పోరాటం ఫలించింది. 13 ఏండ్ల తర్వాత సర్కారి కొలువు అందివచ్చింది. 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఎట్టకేలకు విద్యాశాఖ ఉద్యోగాలిచ్చింది. 1,382 మంది అభ్యర్థులకు కాంట్రాక్ట్ ఉద్యోగాలిచ్చింది. శనివారం జిల్లాలవారీగా కౌన్సెలింగ్ నిర్వహించి, నియామక పత్రాలు, పోస్టింగ్స్ అందజేశారు.

ఒక జిల్లా వారిని మరో జిల్లాకు..

ఒక జిల్లా వారిని, మరో జిల్లా జాబితాలో చూపించినట్టు అభ్యర్థులు ఆరోపించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 182 మంది అభ్యర్థులున్నారు. కొత్త జిల్లాల ప్రకారం సిద్దిపేట 84, సంగారెడ్డి 64, మెదక్ 34 మంది చొప్పున ఉన్నారు. అయితే శనివారం 50 పోస్టులను నింపారు. మరో 34 మందిని సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు కేటాయించినట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. గతంలో పాత జిల్లాల్లో ఉన్న కొన్ని ప్రాంతాలిప్పుడు కొత్త జిల్లాల్లో అంతర్భాగమయ్యాయి. ఆయా ప్రాంతాలకు చెందినవారిని పాత జిల్లాల్లో చూపించినట్టు అభ్యర్థులు పేర్కొంటున్నారు. ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలు సిద్దిపేటలో కలిశాయి. కలిసిన ప్రాంతాల అభ్యర్థులను కొత్త జిల్లాలకు బదులు పాత జిల్లాలకు కేటాయించారని ఆరోపించారు.

ట్రాన్స్‌ఫార్మర్ పాడై.. పొలాలు ఎండి...

- ముస్తఫానగర్‌లో వేధిస్తున్న కరెంట్ సమస్య
- నీరందక ఎండిపోతున్న పంటలు
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిరసన తెలిపిన రైతులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ పాలనలో రైతన్నను సమస్యలు నిత్యం వెంటాడుతున్నాయి. ఓవైపు సాగునీటి కొరత.. మరోవైపు కరెంట్ వ్యథలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగరం నిదర్శంగా నిలిచింది.. ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్‌లోడ్ పడుతుండడంతో తరచూ కాలిపోతున్నది. ఫలితంగా కరెంట్ లేక ఇక్కడి రైతులు పొలానికి నీరు పారించుకోలేని పరిస్థితి దాపురించింది. మూడురోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా, ఇప్పటికీ మరమ్మతులు చేయలేదు.. దీంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయని శనివారం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు నిరసన తెలిపారు. అధికారులు స్పందించి ఓవర్‌లోడ్ సమస్య పరిష్కరించడంతోపాటు, ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శివది దేవయ్య, అక్బర్, దేవేందర్, దోమకొండ రాజయ్య, కృష్ణకాంత్, శ్రీనివాస్, భూమయ్య, రాములు, నర్సయ్య, కంటె దేవయ్య తదితరులు ఉన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

గురుకుల విద్యార్థినులను కరిచిన ఎలుకలు

- మెట్లచిట్టాపూర్ గురుకులంలో ఘటన

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 15: పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత కారణంగా గురుకుల విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఏడుగురు విద్యార్థినులను ఎలుకలు కరిచాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. వెంకట్రావుపేటలోని ఓ ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న గురుకులంలో ఈ నెల 8న వేకువజామున ఎలుకలు దాడిచేయగా విద్యార్థినులకు గాయాలయ్యాయి. దీంతో గురుకుల సిబ్బంది వారిని మెట్‌పల్లిలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను సంప్రదించగా స్పందించలేదు. పక్కనే ఉన్న బియ్యం గోదాం నుంచి ఎలుకలు హాస్టల్ వస్తున్నాయని, ఎలుకల సమస్య తీవ్రంగా ఉందని సిబ్బంది తెలిపారు.

వ్యవసాయశాఖలో ముదిరిన పంచాయితీ!

- కార్యదర్శిపై విస్తరణ అధికారుల మండిపాటు
- అవినీతి ఆరోపణలపై క్షమాపణకు డిమాండ్
- కార్యాలయాల్లో తీవ్రమైన ఏఈవోల ధర్నాలు

జగిత్యాల జిల్లాలో డీఏవోకు వినతిపత్రం ఇస్తున్న ఏఈవోలు

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ శాఖల్లో పాలన పడకేసిందని ఉద్యోగసంఘాల నేతలు ఇప్పటికే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖలో తలెత్తుతున్న వరుస వివాదాలు కార్యకలాపాలకు ఆటంకంగా మారుతున్నాయని తెలుస్తున్నది. వ్యవసాయ విస్తరణ అధికారులపై ఆశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలు కొత్త పంచాయితీకి తెరతీశాయి. కొత్త పట్టాదార్ రైతులకు రైతు భరోసా జమ కాకపోవడానికి ఏఈవోలే కారణమని రఘునందన్‌రావు అన్నట్టుగా ఓ పత్రికలో కథనం ప్రచురితమైంది. పాత పట్టాదార్ పుస్తకాలతో ఏఈవోలు తమ బంధువుల బ్యాంక్ ఖాతా నెంబర్లు నమోదు చేయించారని, ఆ నిధులను దారి మళ్లించారని ఆ కథనంలో ఉంది. ఈ ఆరోపణలను నిరసిస్తూ ఏఈవోలు ఆందోళనబాట పట్టారు.

కష్టానికి బహుమతి ఇదేనా?

వ్యవసాయశాఖ కార్యదర్శి చేసిన ఆరోపణలపై ఏఈవోలంతా ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు వనపర్తి, జగిత్యాల జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వానికి, వ్యవసాయశాఖ కార్యదర్శికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పథకాలను రైతులకు చేరవేసేందుకు తాము శ్రమిస్తుంటే ప్రభుత్వం తమకు ఇచ్చే బహుమానం ఆరోపణలా అని ఆవేదన వ్యక్తంచేశారు. తమపై నమ్మకం లేకపోతే, కొత్త పట్టాదార్ రైతులను నేరుగా బ్యాంక్‌ల్లోనే ఎన్‌రోల్ చేయించవచ్చు కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతుభరోసా నిధులు జమ చేయకపోతే రైతులకు తాము సర్దిచెప్పాల్సి వస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని, కార్యదర్శి తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకుని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కొత్త గొడవేం కాదు!

వ్యవసాయశాఖ కార్యదర్శి, ఏఈవోల మధ్య వివాదాలు కొత్త కాదని తెలుస్తున్నది. కేంద్రం చేపట్టిన డిజిటల్ క్రాస్ సర్వేతో గొడవ ముదిరిందని అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే చాలా పనులతో సతమతమవుతున్నామని, సర్వేనూ తమతోనే చేయించడమేంటని ఏఈవోలు వ్యతిరేకించారు. ధర్నాలు కూడా చేశారు. కార్యదర్శి కావాలనే ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇదే సర్వేను ఇతర రాష్ర్టాల్లో ప్రైవేటు వ్యక్తులతో చేయిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మాత్రం తమపై పని భారం మోపడమేంటని ప్రశ్నించారు. మంత్రి తుమ్మల కూడా తమ గోడు వినలేదని వాపోయారు. పాత వివాదాలను మనసులో పెట్టుకునే రఘునందరన్‌రావు తమపై అవినీతి ఆరోపణలు చేశారని చెప్తున్నారు. అధికారులు పనిని పక్కనపెట్టి పంచాయితీలపై దృష్టి పెట్టడమేంటని ఉద్యోగ నేతలు విమర్శిస్తున్నారు.

పెండింగ్ బిల్లులు ఇప్పించున్రి సారూ!

- తెలంగాణ విజయ డెయిరీ ఎండీకి పాడి రైతుల వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): పెండింగ్ పాల బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ విజయ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డికి డెయిరీ పాడి రైతులు విజ్ఞప్తిచేశారు. శనివారం వివిధ జిల్లాల నుంచి పాడి రైతులు హైదరాబాద్‌కు తరలివచ్చారు. ఈ సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చించారు. అనంతరం డెయిరీ ఎండీ, చైర్మన్‌కు వినతిపత్రాలు సమర్పించారు. బిల్లుల చెల్లింపుతో పాటు సమస్యలు పరిష్కరించాలని కోరారు. పీఐపీ పేరిట లీటర్ బర్రె పాలకు రూ.40 పైసలు, ఆవు పాలకు రూ.20 పైసల చొప్పున వసూలు చేస్తున్న మొత్తాన్ని 2023 డిసెంబర్ నుంచి జిల్లాలకు ఇవ్వడంలేదన్నారు. ఈ నగదును వెంటనే విడుదల చేయాలని కోరారు. రుణాలు తీసుకున్న రైతులకు రూ.10 వేల చొప్పున బోనస్ చెల్లించాలని, హామీ మేరకు పాడి రైతు కూతురు వివాహానికి రూ.5 వేలు, ప్రమాదంలో మరణించిన సభ్యుడి కుటుంబానికి రూ.5 వేలు ఇవ్వాలని విన్నవించారు.

నర్సింహులపేటలోని సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

యూరియా కోసం రైతులు బారులు

నర్సింహులపేట, ఫిబ్రవరి 15: యూరియా కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. వరి, మక్కజొన్న, మిరప పంటలు సాగు చేసిన నేపథ్యంలో రైతుల అవసరాల మేరకు యూరియా లేకపోవడంతో మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం బారులుతీరారు. లారీ లోడ్ యూరియా రావడంతో వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన రైతులు క్యూలైన్‌లో నిల్చున్నారు. మరోవైపు ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ ధరకు యూరియా విక్రయిస్తుండటంతో రైతులకు భారంగా మారింది.

నిజామాబాద్ మార్కెట్ యార్డులో ధర్నా చేస్తున్న హమాలీలు

నిజామాబాద్‌లో హమాలీల ఆందోళన

- చైర్మన్ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా
- యార్డులో నిలిచిన పసుపు కొనుగోళ్లు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 15: నిజామాబాద్ మార్కెట్ యార్డులో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి తమను దొంగలుగా చిత్రీకరించడాన్ని నిరసిస్తూ హమాలీలు ఆందోళనకు దిగారు. దీంతో పసుపు క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. మార్కెట్‌లో పనిచేసే కొందరు పసుపు దొంగతనం చేస్తున్నారని చైర్మన్ ఆరోపించడంతో హమాలీలు ధర్నాకు దిగారు. దాదాపు 40 ఏండ్లుగా ఇక్కడ పనిచేస్తున్న తమపై నెపం మోపడం ఏమిటని ప్రశ్నించారు. అర్ధరాత్రి మార్కెట్‌ను సందర్శిస్తున్నానన్న చైర్మన్.. ఇప్పటిదాకా ఎంత మంది దొంగలను పట్టుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాలక వర్గంలోని కొంత మంది సభ్యులు కావాలనే మార్కెట్ యార్డును బద్నాం చేయడానికి ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమను దొంగలుగా చిత్రీకరించిన వారు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, అప్పటివరకు ఆందోళన విరమించబోమని స్పష్టంచేశారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి అక్కడికి చేరుకోగా హమాలీలు ఆయన్ను చుట్టుముట్టారు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న కార్మికులు సెక్యూరిటీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌పై దాడి చేశారు. పోలీసులు వచ్చి అతడిని అక్కడి నుంచి తరలించడానికి యత్నిస్తుండగా, వాహనానికి అడ్డుపడ్డారు. మధ్యాహ్నం తర్వాత హమాలీలు ఆందోళన విరమించడంతో పసుపు క్రయవిక్రయాలు కొనసాగాయి.

మాపై ఎందుకింత వివక్ష?

- మా మొర ఆలకించేవారే లేరా?
- మాకు న్యాయం చేసేవారు కరువయ్యారా?
- జీతాల నుంచి సంక్షేమం వరకు అన్నింటా వివక్ష
- నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లేస్తే నిరాశే మిగిలింది
- హోంగార్డుల తీవ్ర ఆవేదన

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): తమపై ఎందుకింత వివక్ష చూపుతున్నారని, తమ మొర ఆలకించేవారే లేరా? అని రాష్ట్రంలోని హోంగార్డులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేస్తే తమకు నిరాశే మిగిల్చిందని హోంగార్డులు వాపోతున్నారు. ప్రశ్నిద్దామంటే క్రమశిక్షణ చర్యలు అడ్డొస్తున్నాయని చెబుతున్నారు. ఉన్నతాధికారులు క్రమశిక్షణ పేరిట తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓట్ల కోసం ముద్దొచ్చిన హోంగార్డులు.. అధికారంలోకి వచ్చాక అసహ్యంగా మారారా?' అని ప్రశ్నిస్తున్నారు.

ఏడాదిలోనే ఆశలు ఆవిరి

నమ్మి ఓట్లేసిన కాంగ్రెస్ సర్కారు ఏడాదిలోనే తమ ఆశలను సమాధి చేసిందని కన్నీటిపర్యంతమవుతున్నారు. ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలతో స్క్రిప్టు రాస్తున్న అధికారులు.. ప్రభుత్వానికి వాస్తవాలు తెలియకుండా కప్పిపుచ్చుతున్నారని మండిపడుతున్నారు. హోంగార్డుల కారుణ్య నియామకాల ప్రక్రియకు శాశ్వతంగా బొంద పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని మంత్రులను విన్నవిస్తున్నారు. 'నాడు మేం అడగకముందే మా సమస్యలపై పోరాడి, అండగా నిలబడిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మేం మొరపెట్టుకుంటున్నా దర్శనం ఇవ్వడం లేదు' అని మండిపడుతున్నారు.

ఈ వివక్షలెందుకు?

హోంగార్డుల నుంచి పోలీసు ఆఫీసర్ల వరకు అందరిది ఒక్కటే ఖాకీ కులమని చెప్తూనే తమ పట్ల ప్రభుత్వం వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్నదని హోంగార్డులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు ఒకటో తేదీనే వేతనాలు వేసే ప్రభుత్వం.. తమకు రావాల్సిన వేతనాలను దారి మళ్లించి, 13 రోజులైనా జీతాలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. డ్యూటీల దగ్గర అందరూ సమానమైనప్పుడు వేతనాల వద్ద భేదాలెందుకని నిలదీస్తున్నారు. సంక్షేమం, వేతనం, ఆటలు, పదవీ విరమణ.. ఇలా అన్ని విషయాల్లోనూ తమపై వివక్ష చూపుతున్నారని పేర్కొంటున్నారు. ఆఖరికి తాము మరణించినా వివక్ష చూపుతున్నారని మండిపడుతున్నారు. తమ పిల్లలను చదివించలేక పోతున్నామని, తల్లిదండ్రులను పోషించలేకపోతున్నామని అంటున్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నా హెల్త్‌కార్డుల సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఇంటి కిరాయిలు కట్టలేక అవమానాల పాలవుతున్నామని రోదిస్తున్నారు. బ్యాంకు లోన్లకు అదనపు వడ్డీలు చెల్లించాల్సి వస్తున్నదని బాధపడుతున్నారు. చనిపోయిన హోంగార్డుల పిల్లలు అనాథలుగా జీవిస్తున్నారని.. కనీసం కారుణ్య నియామకాలైనా చేపట్టాలని ప్రాధేయపడుతున్నారు.

అయిజ పీఏసీఎస్ ఎదుట ఆందోళన చేస్తున్న కంది రైతులు

అయిజలో కంది రైతుల ఆందోళన

- కందుల కొనుగోళ్లలో సిబ్బంది చేతివాటంపై అన్నదాతల ఆగ్రహం

అయిజ, ఫిబ్రవరి 15 : కందుల కొనుగోళ్లలో పీఏసీఎస్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ శనివారం జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని సబ్ మార్కెట్ యార్డులో రైతులు ఆందోళనకు దిగారు. 50 కిలోల కందుల బస్తాకు సిబ్బంది కిలో 300 గ్రాములు తీసుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం 50 కిలోల బస్తాకు కేవలం 600 గ్రాములు సేకరించాల్సి ఉన్నా పీఏసీఎస్ సిబ్బంది 700 గ్రాములు అదనంగా దోపిడీ చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. దీనిపై రైతులు ప్రశ్నిస్తే కొనుగోళ్లను నిలిపివేస్తున్నారని ఆరోపించారు. అదనంగా తీసుకున్నట్టు రుజువైతే చర్యలు తీసుకుంటామని మార్క్‌ఫెడ్ డీఎం చెప్పారు. రైతుల వద్దకు వచ్చిన సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి నిబంధనల మేరకు అదనంగా తీసుకుంటామని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఆయన అక్కడి నుంచి జారుకున్నారు. చైర్మన్ సరైన సమాధానం చెప్పకపోవడంతో రైతులు పీఏసీఎస్‌కు చేరుకొని ఆందోళన చేట్టారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన అదనపు కందులను రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య మద్దతు పలికారు.